REGD. NO. A. 40 విడి ప్రతి 0-3-0 శుక్రవారం 30-10-59

# జమీన్ రైతు

సంపుటి 31 | సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు : సంపాదకుడు :: నెల్లూరు శ్రీరామమూర్తి | సంచిక 44

## హైదరాబాద్ లేఖ

★ ★ ★ మా విలేకరి ★ ★ ★

## మూడేండ్ల విశాలాంధ్ర

వచ్చేవారం విశాలాంధ్ర రాష్ట్రమేర్పడి మూడు సంవత్సరాలు నిండుతాయి. ఈ మూడేళ్ళలో అదివరకెన్నడూ లేనంతటి రాజకీయ సుస్థిరత్వాన్ని తెలుగుప్రజలు పొందారు. పూర్వం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కాని, ఆంధ్రరాష్ట్రంలో కాని, పూర్వపు హైదరాబాదు రాష్ట్రంలో కాని ఏ ముఖ్యమంత్రికీ లభ్యం కాని రాజకీయ ప్రశాంతత నీలం సంజీవరెడ్డిగారికి లభించింది.

కేవలం సంజీవరెడ్డిగారిని పదభ్రష్టుని చేయాలనే వుద్దేశ్యంతో కాంగ్రెసులోపల ముఠాలు కట్టడం, కాంగ్రెసు అధిష్ఠాన వర్గానికి ఫిర్యాదులు చేయడం, తరువాత కాంగ్రెసు నుంచి విడిపోయి కొత్త పార్టీ పెట్టుకోవడం, సోషలిస్టులతో చేతులు కలపడం, ఆదిచాలక ఓ పిల్లిగంతు వేసి సోషలిజంతో సంబంధం లేని స్వతంత్రులతో చేరిపోవడంలాంటివి జరిగినవి. ఇలాంటివి ఎన్ని జరిగినప్పటికీ సంజీవరెడ్డిగారి నాయకత్వం శాసనసభలో కొత్తబలాన్ని పుంజుకుందే కాని ఏమాత్రం బలహీనపడలేదు.

రాజకీయంగా లభించిన ఈ సదవకాశాన్ని సంజీవరెడ్డిగారు, ఆయన సహచరులు జారవిడవలేదు. ప్రణాళికా పథకాల అవరణలోను ఇతర రంగాలలోను రాష్ట్రం నిరాటంకంగా పురోగమించడానికి తగిన పునాదులు వేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చురుకుగా కొనసాగుతున్నది. మరి మూడేళ్ళలో; ఆంధ్రప్రదేశ్ ఆరవ వార్షికోత్సవం చేసుకునే సమయానికి, 64 చదరపు మైళ్ళ వైశాల్యం కల మానవనిర్మిత జలాశయం అవతరిస్తుంది. అప్పుడు దీని చుట్టూ నూరు మైళ్ళలోపు ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా వుండవనీ రాత్రులు చాలా చల్లగా వుంటాయనీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తుంగభద్ర జలాల వినియోగం ఇతోధికంగా జరిగేటట్టు కడప — కర్నూలు కాలవ మరమ్మతులు పూర్తి కావడానికి, ఎగువసీలేరు జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణారంభానికి 16 కోట్లు, పోచంపాడు ప్రాజెక్టు పని ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి అయాయి. శ్రీశైలం ప్రాజెక్టు దర్యాప్తులు కూడా పూర్తి అయాయి. రెండేళ్ళ తరువాత కట్టడం మొదలు పెడ్తారు.

మూడు క్రొత్త వైద్య కళాశాలలు, రెండు ఇంజనీరింగు కళాశాలలు అవతరించాయి. పదిహేడు పాలిటెక్నిక్కులు, రెండు ప్రత్యేక మహిళా కళాశాలలు వెలిశాయి. సంగీత నాటక ఎకాడమీ, సాహిత్య ఎకాడమీ ఏర్పడ్డాయి. జిల్లాబోర్డులుపోయి జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితులు వచ్చాయి. పరిపాలనా వికేంద్రీకరణకు నాందీప్రస్తావన జరిగింది.

ఎంతోకాలంనుంచి నిర్లక్ష్యం చేయబడిన ఈ ప్రాంతంలో పారిశ్రామికాభ్యుదయానికి కూడా దారి ఏర్పడిందని భావించవచ్చు. తెలంగాణాలోని పరిశ్రమల నిర్మాణం, ఆంధ్ర పేపరుమిల్లు విస్తరణ, కొత్తగూడెంలో రసాయన ఎరువుల కర్మాగార స్థాపన కానుండడం మన రాష్ట్రంలో పారిశ్రామికంగా నూత్న శకారంభానికి సూచనలని తలచవచ్చు.

దేశపునర్నిర్మాణ కార్యకలాపాలు ఈ విధంగా, కొంత విజయవంతంగానే కొనసాగుతున్నా ప్రజలలో తృప్తి కాని, తమభవిష్యత్తు ఆశాజనకంగా ఉందనే విశ్వాసం కాని ద్యోతకమవుతున్నాయని చెప్పలేము. సోషలిస్టుసమాజ నిర్మాణం ఆశయంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెసు నాయకులు చెబుతున్నారు. కాని ఇందుకు అనుగుణంగా సోషలిస్టు విలువల నిర్మాణం జరుగుతున్నదని చెప్పలేము. ఇందుకు ప్రధాన బాధ్యత ప్రస్తుతం సంపూర్ణంగా సంజీవరెడ్డిగారి నాయకత్వం క్రింద నడుస్తున్న ఆంధ్రప్రదేశ కాంగ్రెసు దేనని వేరే చెప్పనక్కరలేదు. ప్రజలలో, సంఘంలో ఉంటున్న ప్రాంతీయ, కుల, మత అభిమానాలను దురభిప్రాయాలను తొలగించేటందుకు యత్నించే బదులు వీటి నాశ్రయించి సంస్థ బలపడిన వ్యక్తిగత ఆశయసాధనను పొందేటందుకే, పరిపాలనా బాధ్యత వహిస్తున్న సంస్థ నాయకులు కార్యకర్తలు బాహాటంగా యత్నిస్తున్నారనడానికి రెండేళ్లకొకసారి జరిగే కాంగ్రెసు వ్యవస్థ ఎన్నికలే నిదర్శనం.

పరిపాలనలో రాజకీయ జోక్యాలవల్ల న్యాయం (ఎడ్మినిస్ట్రేటివ్ జస్టిస్) లభిస్తుందన్న విశ్వాసం ప్రజల్లో లేకుండాపోయింది. బంధుప్రీతి, ఆశ్రితజనరక్షణ ఇవి కేవలం ఎవరో కొందరు రాజకీయశత్రువులు చేసే నిందలు కావని జనాభాలో చాలామందికి అనుభవైక వేద్యాలే. ప్రభుత్వ స్కూళ్లలో కాదు, ఒక్క మిషన్ స్కూళ్ళకు తప్ప, ఏ స్కూలుకు పంపినా పిల్లలకు చదువురాదని తల్లిదండ్రులంతా స్వయంగా నిత్యం తెలుసుకుంటున్నదే. ముఖ్యమంత్రి పిల్లలు హైదరాబాదు పబ్లిక్ స్కూలులోను, ఇతర ప్రముఖుల పిల్లలు సాధారణ కుటుంబాలకు అందుబాటులేని ప్రత్యేకతర విద్యాలయాల్లో చదువుకుంటున్నారంటే ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్వహిస్తున్న పాఠశాలలపైన తలిదండ్రులకే నమ్మకం లేదని వేరే చెప్పనక్కరలేదు. బేసిక్ విద్యావిధానంపై మన విద్యామంత్రికి వున్న ఈసడింపు బహిరంగ రహస్యమే. గ్రామాలలో శాంతిభద్రతలు డబ్బిచ్చి కొనక్కునే వారికే లభిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. మద్యపానంపై నిషేధం లేకపోయినా రాష్ట్ర రాజధాని నగరంలో అయిదు చోట్లకు పైగా దొంగసారాయి బట్టీలు వున్నాయి. ఆంధ్ర ప్రాంతంలో మద్యనిషేధం నామమాత్రమని వేరే చెప్పనక్కరలేదు. నీరా సొసైటీలు కల్లు దుకాణాలేనని శాసనసభ్యులే అంటున్నారు. పొదుపు ఉద్యమ వసూళ్లు, శిస్తుబకాయీల వసూళ్లు వగైరాల పేరిట జరుగుతున్న అత్యాచారాలు, దౌర్జన్యాలగూర్చి చెప్పని గ్రామస్థుడు కనబడడు.

కష్టాలు, ఇబ్బందులు మాయం కాకపోయినా అవి తొలగిపోతున్నాయి అనే విశ్వాసం ప్రజల్లో కలిగించని ప్రభుత్వం సార్థకం కాజాలదు. మన ప్రభుత్వం ప్రస్తుతం యీ దశలో వుండడానికి ఎవరూ కాంగ్రెసు శత్రువులు కాని, సంజీవరెడ్డి వ్యతిరేక ముఠాకు చెందినవారు కాని కావలసిన అవసరం లేదు. ఆంధ్రాభ్యుదయం కాంక్షించేవారంతా యీ ప్రాథమికమైన లోపాలను సంజీవరెడ్డి మంత్రివర్గం తొలగించాలని కోర్తారు. (26-10-59)



ఏ ముఖ్యమంత్రికిలేని రాజకీయ ప్రశాంతత లభ్యంచేసుకున్న ఆంధ్రముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి

### ఏది సత్యం? ఏదసత్యం

చైనా దురాక్రమణవిషయంలో తాను పార్టీవైఖరితో విభేదిస్తున్నానన్నారు శ్రీ డాంగే. మాలో విభేదాలున్నాయనేమాట కల్పితమని తలవిచ్చారు శ్రీ నంబూద్రిపాద్. విభేదాలు యదార్థమేనని దృఢపరచారు కార్యదర్శి శ్రీ అజయ ఘోష్. వీటిలో ఏది సత్యమో, ఏది అసత్యమో పాఠకులే నిర్ణయించవలెను.

మొత్తానికి కమ్యూనిస్టుపార్టీ నాయకులనుండి పరస్పర విరుద్ధ ప్రకటనలు, బహిరంగ చెప్పలు వస్తున్నవి. అది మంచిదే!

దివ్యమైన ద్వితీయ వార్షికోత్సవ
సంతోష సమయంలో
గోకుల బృందావన్
బృందావనం—నెల్లూరు
వారు
తమ భోక్తలకు - అభిమానులకు
దీపావళి శుభాకాంక్షలు అందజేస్తున్నారు

# వార్తలు-వ్యాఖ్యలు

## ● చైనాపట్ల భారతదేశ విధానం మారాలె

17 మంది భారత గస్తీదళ సభ్యులను హతమార్చిన చైనా దురాగతం భారతదేశానికి మహోపద్రవాన్ని తెచ్చిపెడుతున్నది. చైనాతో మంతనాలుమాని, దేశరక్షణ కుపక్రమించడం తక్షణావసరం.

## ● క. పార్టీ నాయకత్వంపై డాంగేతిరుగుబాటు

చైనా దురాక్రమణ విషయంలో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంపై డాంగే జేసిన తిరుగుబాటు, మూఢకమ్యూనిస్టులకు కనువిప్పు కాగలదు. ఇది దేశ రాజకీయాలకుకూడ ఆరోగ్యకరం.

## ● భారత కమ్యూనిస్టుపార్టీలో సంక్షోభం

ఇండియా-చైనా సరిహద్దువివాదం, భారత కమ్యూనిస్టుపార్టీలో సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. పార్టీనాయకత్వం అజయఘోష్‌నుండి డాంగేకు గావి, నంబూద్రిపాద్‌కుగాని మారవచ్చు.

భారత సరిహద్దులో చైనా దురాగతానికి పాల్పడింది. అక్టోబరు 21 తేది చైనాసైనికులు భారత భూభాగంలోకి నలభై మైళ్లు చొచ్చుకవచ్చి, దక్షిణలడక్‌లోని చాంగ్ చన్మోలోయలో, భారత గస్తీదళానికి సంబంధించిన 17 మందిని కాల్చి, కిరాతచర్యకు ఒడిగట్టారు. మరెందరినో గాయపర్చారు. చైనాసైనికుల యీ దురాగతం భారత ప్రజలకేకాదు, యావత్ ప్రపంచానికీ దిగ్భ్రాంతినీ, ఆగ్రహాన్నీ కలిగించింది.

ఇప్పుడు మన సరిహద్దుల్లో చైనా యింత ఘోరమైన దురాగతాలు వరుసగా సాగిస్తున్నప్పటికీ, మొదట్నుంచీ ప్రభుత్వం ప్రమత్త వైఖరినే చూపుతుండడం శోచనీయమైన విషయం. పరిస్థితి అత్యంత ప్రమాదభరితంగానే వుందనీ, కాని ఇండియా-చైనాలమధ్య యుద్ధం సంభవించక పోవచ్చుననీ, భారత ప్రజలను ఆగ్రహపడవద్దనీ శ్రీ నెహ్రూ చెప్పడం ఈఘోర దురంతం జరిగిన తర్వాతకూడ ఇండియా – చైనాల రెండువేల సంవత్సరాల స్నేహప్రవంతినిగూర్చి ఆలాపిస్తుండడం విచారకరమైన విషయం. దేశానికి ఏర్పడిన యీ మహోపద్రవాన్ని తట్టుకోడానికి ఏమి చేయదలచిందీ భారత ప్రధాని మాచనప్రాయంగానైనా తెలియజేయడంలేదు. ఇప్పుడు దక్షిణలడక్‌లో జరిగిన యీ ఘోర కృత్యాన్నిబట్టిచూస్తే మన దేశరక్షణ కృషి లోతుభూయిష్టంగానే వుందేమోననిపిస్తుంది. లేకపోతే చైనాసేనలు 40 మైళ్లు ఎట్లా ముందుకు చొచ్చుకొని వస్తాయి?

చైనావిషయంలో ప్రభుత్వ విధానం విఫలమైందనే చెప్పవచ్చు. చైనా దురాక్రమణను గురించి ప్రధాని శ్రీ నెహ్రూ పొరపాటు అంచనావేశారు. ఏదోకొన్ని నిర్జన హిమాలయ ప్రాంతాలకోసం చైనా తాపత్రయపడుతున్నదని భావించారు; హిమపర్వత రాజ్యాలలో ఆధిపత్యంకోసం కొంటాలు పడుతున్నదని పొరపాటు పడ్డారు. నెహ్రూగారి యీ అభిప్రాయం సరైనది కాదు. కమ్యూనిస్టు చైనా ఉద్దేశ్యం లడక్, నేపాల్, భూటాన్, సిక్కిం ప్రాంతాలవరకే పరిమితం కాదనీ ఇండియాను కబళించడం దాకా వచ్చేది యీనాటికైనా ప్రభుత్వం గుర్తించడం అత్యంతావసరం.

అలీనరీత్యా మన విదేశాంగ విధానం (తటస్థవిధానం) మంచిదే కావచ్చునేమోగాని హూణా—కమ్యూనిస్టు సామ్రాజ్యతత్వం విశదమైన పిమ్మట, చైనాను సంతృప్తిపరచే విధానం అవలంబించడం సరికాదు. ఇండియా క్షేమంకట్లగాక, చైనా స్నేహమే తన ప్రథమ బాధ్యతగా భారతప్రధాని చూడడం మంచిదికాదు. ఈ వైఖరి మారాలి. లేకపోతే దేశానికి ముప్పు సంభవిస్తుంది. చైనా పట్ల భారతప్రధానికి విశ్వాసంవుంటే వుండవచ్చునేమోగాని, భారతప్రజలకు లేదు. చైనాతో మంతనాలకు దిగాలనే అభిప్రాయం ప్రధాని శ్రీ నెహ్రూకు దృఢంగావుంది. అసలు యీ మంతనాలవల్ల ఏపాటి ప్రయోజనం వుంటుందో అర్థంకావడంలేదు. మంతనాలు జరిగినా, జరగకపోయినా, యీ క్రమంతత ఏమాత్రం వుండకూడదు. భారతప్రభుత్వం యీ చైనా మిానమేషాలు లెక్కించడం మాని తేసి, చైనాదురాక్రమణ కారినుండి భారతదేశాన్ని సంరక్షించేందుకు కట్టుదిట్టాలు చేయడం తక్షణావసరం.

## డాంగే తిరుగుబాటు

ఇండియా—చైనాలమధ్య సరిహద్దు వివాదం ప్రారంభమైన నాటినుంచీ, చైనాచర్యలు ఇండియా కమ్యూనిస్టులలో కలవరం కలిగించినవి. మార్క్సిస్టు సిద్ధాంతం 'ఖాషీకరణం'లో చైనా దురాక్రమణను సమర్థించడానికి పార్టీ నాయకులకు కష్టమైంది. పార్టీ వ్యవస్థాపకులు కమ్యూనిస్టుపార్టీ అగ్రనాయకుల్లో వొకరైన కామ్రేడ్ యస్. ఏ. డాంగే, సరిహద్దులో 17 మంది భారత గస్తీదళాన్ని చైనాసైనికులు పొట్టబెట్టుకున్న కిరాతక కృత్యాన్ని ఖండించారు. చైనా విధానాన్ని విమర్శించారు. కమ్యూనిస్టు చైనాదురాక్రమణను ఎదిరించుటకు, యావద్భారతదేశమూ ప్రధాని శ్రీ నెహ్రూకు బాసటగా నిలవాలని విజ్ఞప్తిచేశారు. చైనా—ఇండియా సరిహద్దు విషయంలో, పార్టీకేంద్ర సంఘం విధానంతో తాను ఏకీభవించడంలేదని స్పష్టంచేశారు. చైనాతోకాని పాకిస్తానుతోకాని యుద్ధం (అది మన పురోభివృద్ధికి ప్రతిబంధకం కాబట్టి) సమర్థనీయంకాదనీ, కాని దేశంమీద దాడి జరుగుతున్నప్పుడు దానిని ప్రతిఘటించడం, కమ్యూనిస్టులతోసహా, ప్రతి పౌరుని కర్తవ్యమని ఉద్ఘాటించారు శ్రీ డాంగే. దీనినిబట్టి చూస్తే కామ్రేడ్ డాంగే, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంమీద తిరుగుబాటు లేవదీశారనే చెప్పవచ్చు. కమ్యూనిస్టుపార్టీ తప్పుడువిధానాన్ని సరిదిద్దుటకు, ఆత్మవిమర్శ

—కొరవ 10-వ పేజీలో

## పి. సి. ఘోష్ స్వతంత్రపార్టీలో చేరుతారా?

పాతకాంగ్రెస్‌వాది, నిజమైన గాంధేయుడు, పశ్చిమబెంగాలు మాజీముఖ్యమంత్రి, ప్రస్తుతం రాష్ట్రప్రజాసోషలిస్టుపార్టీ నాయకుడైన శ్రీ ప్రఫుల్లచంద్రఘోష్ స్వతంత్రపార్టీలో చేరుతారనే వార్తలు వస్తున్నవి. ఇటీవల శ్రీ ఘోష్ మద్రాసులో శ్రీ రాజగోపాలాచారిగారితో సుదీర్ఘచర్చలు గూడా జరిపారట.

హిందూమహాసభ మాజీఅధ్యక్షులు, బెంగాల్‌నాయకులు శ్రీ ఎన్. సి. ఛటర్జీగూడా స్వతంత్రపార్టీలో చేరే అవకాశమున్నదట.

# లఘు విమర్శలు ...

నష్టమేమీ లేకపోయినా ఆంధ్రదేశమంతటా భూకంపం సంభవించింది.

పంచాయతీ ఎన్నికలలో జరుగుతున్న నీతిమాలిన పనులకు భూదేవిగూడా కంపించిపోయిందన్నమాట!

◆ ◆ ◆

ఢిల్లీలో జరుగబోయే ప్రపంచవ్యవసాయ ప్రదర్శనంలో చైనా పాల్గొనబోవడంలేదట.

ఎకరాకు 360 పుట్ల ధాన్యాన్ని ఎట్లా పండించారో చూపమని నిలదీసి అడుగుతారని కాబోలు!

◆ ◆ ◆

కేరళలో కాంగ్రెస్ ముస్లింలీగుతో పొత్తు పెట్టుకున్నందువల్ల ప్రజాస్వామ్యం గంగలో కలసిపోతున్నదని కమ్యూనిస్టులు గోల చేస్తున్నారు.

దేశాన్ని చైనాకు అమ్మాలనుకునే ద్రోహులకు యీమాటలనేహక్కు ఎక్కడిది?

◆ ◆ ◆

"...ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఎప్పుడూ దేవాలయాలకు వెళ్ళరని అంటారు. కాని ఆయనను మనం తిరుపతి దేవాలయానికి తీసుకొనివెళ్ళి దైవదర్శనం చేయించాము. తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆశీర్వచనాలతో నెహ్రూగారు ఆంధ్రదేశాన్నుండి తిరిగి వెళ్ళారు."— ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి.

అంతేగాదు, భాషారాష్ట్రాలకు వ్యతిరేకియైన శ్రీ నెహ్రూ చేత ఆంధ్రరాష్ట్రం యిప్పించుకున్నాము; ఏ రాష్ట్రంలో లేని వుపముఖ్యమంత్రి పదవికి ఆనాడు వారిచేత ఒప్పించుకున్నాము; మురారితత్వం, పర్గపాలన ప్రాంతీయ దురభిమానంవున్నా 'సెబాస్ ఆంధ్ర' అని చెప్పించుకున్నాము........."

ఇలాంటి విశేషణాలనుగూడా ముఖ్యమంత్రి గారి ప్రకటనలో చేర్చివుంటే బాగుండేదేమో!

◆ ◆ ◆

"మనని మనం గౌరవించుకోవడం ముందుగా నేర్చుకోవాలి. అప్పుడే ఇతరులు మన ప్రతిభను సత్కరిస్తారు"—ఒక సాహిత్యసభలో ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి.

—కొరవ 9-వ పేజీలో


దేహం కదలినపుడల్లా అందం చిందుతుంది

అన్‌క్రషబుల్
వాటర్‌ప్రూఫ్
వెల్వెట్

ఫ్రెంచిబ్యూటీ
ఫ్లవర్
వెల్వెట్

మెషిన్ ప్రింటెడ్
రాయం
వెల్వెట్



రాయవరపు శంకరయ్య అండ్ సన్సు
CLOTH MERCHANTS
ట్రంకురోడ్డు — నెల్లూరు
టెలిఫోన్ : 138.




# ● ఆశియాఖండానికి కంటకంగావున్న చైనాధోరణి
# ● చైనానుండి యూడిన్ మరలింపులో రహస్యం?
# ● శిఖరాగ్రచర్చలు: ముందున్నది రామాయణం!
# ● ఈప్రజాస్వామ్యంలో విశ్వాసంపోయింది! తర్వాత?

చైనా ధోరణి అందరికీ విపరీతమనిపిస్తున్నది. బ్రర్మా ప్రధాని మన ప్రధానితో కలిసి వెళ్లుతూ ఇట్లు అన్నారు: "ఈ చైనావారి వైఖరి బోధపడడంలేదు. తటస్థరాజ్యాలమీద వీరు దాడులు చేస్తున్నారు. యుగోస్లావియామీద దూకివారు మొదట. బర్మాతో సరిహద్దు పేచీలట్లే వున్నవి. ఇండియా సరిహద్దున పరిస్థితి విషమించింది. ఈజిప్టు–సిరియా (అరబ్) సమాఖ్య రాయబారితో పేచీవచ్చింది పెకింగ్‌లో. ఇదంతా ఏమిటి?"

ఇంతే గాక చైనాజనం ఎక్కువగా ఏదేశంలోవుంటే ఆ దేశంలో ఇతరప్రజలకు, ఆ దేశ ప్రభుత్వానికి అదొక సమస్య. సింగపూర్‌లో, మలయాలో నడిచే కమ్యూనిస్టుల తిరుగుబాటుకు అక్కడి చైనాజనం, పైనుంచి చైనా ప్రభుత్వం సహాకారం లో పాయకారిగా అందిస్తున్నందువల్ల పరిస్థితి క్లిష్టమైపోయింది. ఇండోనేషియాలో చైనావారే పంతన్నలైవుంటూ, స్వదేశానికి విరివిగా పైసలు పంపుకుంటూ వుండిరి; ...

## 'సాధు' గారి ఛాందసం!

వచ్చే గాంధీ జయంతినుండి తెలంగాణాలో మద్యనిషేధం అమలు జరపకుంటే నిరసన వ్రతం పూనుతానంటాడు–సర్వోదయ నాయకుడు శ్రీ సాధు సుబ్రహ్మణ్యం.

మద్యనిషేధం అమలులో వున్నఆంధ్రజిల్లాలలో, త్రాగుడు ఎక్కువై, అరికట్టే దిక్కులేక, కాంగ్రెస్‌కు ప్రభుత్వానికిగూడా అప్రతిష్ఠాకరంగా పరిణమించి, రద్దుజేయడమే వుత్తమమా అనే పరిస్థితుల్లో, క్రొత్తప్రాంతంలో ప్రవేశపెట్టమనడం ఛాందసం గాక మరేమవుతుంది?

అంతకంటె, వున్నచోట సక్రమంగా అమలుజరపమని ఒత్తిడి తేవడం అవసరం.

మధ్యప్రదేశ్ - 4

# రూపమతి-బాజ్‌బహద్దూర్ల విషాదగాథ
## మాండూకోట శిథిలాలలో అడ్డువచ్చే మధురఘట్టం

★ శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య ★

మాండూ మొందటిరాజా మహమ్మద్ గోరీ వంశపు అంకురమైన హుషంగషా. ...

—తరువాత 8.వ పేజీలో

—తరువాత 10 వ పేజీలో

## శ్రీ సీతారాం యాత్రా స్పెషల్ సర్వీస్

20–11–59 తేదిన తిరుపతినుండి, శ్రీరంగం - ధనుష్కోటి - రామేశ్వరం - కన్యాకుమారి - మొదలగు 45 క్షేత్రములు దర్శించు

సంపూర్ణ దక్షిణదేశ యాత్ర

రెండుపూటలు శుచిగా బ్రాహ్మణ భోజనములున్నూ, స్నాన దర్శనాదులకు పోవు రక్షణ, గుర్తింపు చార్జీలున్నూ, కూలీలఖర్చులున్నూ, పత్రిముల దొరుగులు వగైరాలతో సహా. } రు. 125 లు మాత్రమే

కపాసిటీకి మించి బుక్ చేయము - కొద్దిసీట్లు మాత్రమే కలవు - వివరములకు:-

ప్రొప్రైటరు:- **K. S. చౌదరి,** బి. ఏ. తిరుపతి, చిత్తూరుజిల్లా.

## శ్రీ వాణీ ట్యుటోరియల్ కాలేజి,

51, (మంటపాలు) ఆచారివీధి - నెల్లూరు (స్థాపితం - 1950)

S. S. L. C., మెట్రిక్, B. A. (లెక్కలు)

P. U. C. (అన్నిపార్టులు - గ్రూపులు) కోర్సులకు

9 సంవత్సరముల ట్యుటోరియల్ అనుభవముతో మంచి ఫలితములు యిస్తున్నాము. 1960 మార్చి పరీక్షలు వచ్చుచున్నవి. త్వరగా చేరండి. హాస్టల్ వసతి కూడ యున్నది.

డి. శ్రీనివాసరావు, డైరెక్టరు. డి. వెంకటప్పారావు, M.A. ప్రిన్సిపాల్.

